సాక్షి
జోగులాంబ గద్వాల
ఆదివారం । 25 । ఆగస్టు । 2024

గరిష్టం/కనిష్టం
33.0 /24.2

వాతావరణం
అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పాగుంట వేంకటేశ్వరుడికి జడ్జి ప్రత్యేక పూజలు



కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురంలో వెలసిన పాగుంట లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని శనివారం గద్వాల జడ్జి గంటా కవితాదేవి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారికి ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారికి అర్చనలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. శేషవస్త్రంతో సన్మానించారు.

వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి



అయిజ: రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారులకు పంటల బాగోగుల గురించి చర్చించాలని, పురుగులు, తెగుళ్లు పంటలను ఎక్కువగా ఆశించినప్పుడు అధికారుల సలహాల మేరకు మందులు పిచికారీ చేయాలని పాలెం వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. మండలంలోని వెంకటాపురం, పర్దీపురం, అయిజ శివార్లలో సాగుచేసిన వేరుశనగ, కంది, పత్తి, కొర్ర, సజ్జ, మినుము పంటలను శనివారం శాస్త్రవేత్తలు పరిశీలించారు. మినుము పంటలో స్పొడప్ట్రా, ఎలికోవర్పా అని పిలవబడే రెండు లద్దెపురుగుల ఉధృతి ఎక్కువగా ఉందని, వీటి నివారణ కోసం ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాలెం వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ డీ శశిభూషణ్, డాక్టర్ శంకర్, డాక్టర్ రామిరెడ్డి, డాక్టర్ సైదయ్య, డాక్టర్ ఈశ్వర్ రెడ్డి, పాలెం శాస్త్రవేత్తలు కె. జనార్దన్, అయిజ మండల వ్యవసాయ అధికారి జనార్దన్ పాల్గొన్నారు.

ముంపు గ్రామ ప్రజలు ఆందోళన చెందొద్దు



గట్టు: చిన్నోనిపల్లె రిజర్వాయర్‌ను గద్వాల ఆర్డీఓ రాంచందర్, తహసీల్దార్ సరితారాణి శనివారం సందర్శించారు. వర్షాల కారణంగా రిజర్వాయర్‌లోకి వరద నీరు వచ్చి చేరుతున్న తరుణంలో చిన్నోనిపల్లె మొత్తం నీటితో నిండిపోయే ప్రమాదం ఉందని ముంపు గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తూ వచ్చారు. అయితే రిజర్వాయర్‌లోని నీటిని కొత్త కాల్వ ద్వారా బయటకు పంపే ఏర్పాట్లు చేయడం.. లింగాపురానికి చెందిన రైతులు అభ్యంతరం తెలిపిన నేపథ్యంలో ఆర్డీఓ తదితరులు అక్కడికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ముంపు గ్రామ ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కొత్త కాల్వ ద్వారా నీటిని బయటికి పంపుతామని, ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్డీఓ తెలిపారు. వీరి వెంట ఆర్ఐ రాజు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ఉత్తమ అవార్డుల ప్రదానం



స్టేషన్ మహబూబ్‌నగర్: హైదరాబాద్‌లోని ఆర్టీసీ కళాభవన్‌లో శనివారం ప్రగతిచక్రం పురస్కారాల ప్రదానోత్సవం కార్యక్రమం జరిగింది. ఇందులో మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్‌లోని వివిధ డిపోలకు చెందిన 9 మంది ఉద్యోగులు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ చేతులమీదుగా ఉత్తమ అవార్డులను అందుకున్నారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ కండక్టర్లుగా ఎండీ సుల్తాన్, షర్ఫుద్దీన్ (వనపర్తి డిపో), ఎక్స్‌ట్రా మైల్ కింద ఉత్తమ కండక్టర్లు కె.శ్రీనివాసులు, ఫర్జానా బేగం (కల్వకుర్తి డిపో), నిర్మల (నాగర్‌కర్నూల్), వెంకటస్వామి (కొల్లాపూర్), ఉత్తమ ఆర్టిజన్‌గా పి.మహాలింగం (నాగర్‌కర్నూల్), ఉత్తమ సేఫ్టీ డ్రైవర్ ఇన్‌స్ట్రక్టర్‌గా రవికుమార్ (నాగర్‌కర్నూల్), ఉత్తమ సూపర్‌వైజర్‌గా కె.నాగరాజు (ఆర్ఎం కార్యాలయం) పురస్కారాలు అందుకున్నారు. అవార్డులు పొందిన ఉద్యోగులను రీజినల్ మేనేజర్ వి.శ్రీదేవి అభినందించారు.

భయపెడుతున్న పాత భవనాలు

జిల్లాలో వందల్లో నివాస గృహాలు.. వందల్లో వ్యాపార సముదాయాలు



జిల్లా కేంద్రంలో శిథిలావస్థలో ఉన్న పీఏసీఎస్ గోదాం

- కూలేందుకు సిద్ధంగా ఉన్నా పట్టించుకోని అధికారులు
- నోటీసులు ఇచ్చి సరిపెడుతున్న వైనం
- ఇటీవల అయిజలో పూరిగుడిసె గోడ కూలి బాలిక మృతి
- ఇకనైనా అధికారులు కళ్లు తెరిచేనా..?



అయిజ మున్సిపాలిటీలో గుడిసె కూలిన ప్రదేశంలో రోదిస్తున్న బాలిక కుటుంబసభ్యులు (ఫైల్)

గద్వాల టౌన్: 2010 జూన్ 12 నాడు.. గద్వాల కూరగాయల మార్కెట్‌లో శిథిలమైన ఓ సముదాయం పేకమేడలా కుప్పకూలింది. ఈ ఘటనలో పది మంది అక్కడిక్కడే దుర్మరణం చెందారు. మరి కొంత మంది గాయపడ్డారు.

■ 2021 అక్టోబరు 09 నాడు.. అయిజ మండలం కొత్తపల్లి గ్రామంలో నివాస గుడిసె గోడ పేకమేడలా కూలి పెనువిషాదాన్ని నింపింది. ఇంట్లో నిద్రిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన అయిదుగురు మృత్యుఒడిలోకి చేరారు.

■ 2024 ఆగస్టు 21 నాడు... అయిజ మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపేట కాలనీలో నివాస గుడిసె గోడ కూలి ఎనిమిదేళ్ల చిన్నారి శ్రీకృతి మృతి చెందింది. మరో చిన్నారి గాయపడింది.

పై సంఘటనలను చూస్తే.. చేతులు కాలేదాకా కళ్లు తెరుచుకోరు, కాళ్లు కదలవు అన్నట్లుగా ఉంది ఆయా శాఖల అధికారుల పనితీరు. శిథిలమైన భవనాలు, ఇళ్లు అధికారుల కళ్లెదుట కనిపిస్తున్నా అటువైపు కన్నెత్తి చూడని పరిస్థితి కనిపిస్తుంది. ప్రమాదం జరిగిన సమయంలో సంబంధిత అధికారులు స్థానికంగా ఉన్న శిథిల భవనాల యజమానులకు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకోవడం పరిపాటిగా మారింది. ప్రతి ఏడాది ఎక్కడో ఒక చోట ఇలాంటి సంఘటనలు జరుగుతున్నా.. విలువైన ప్రాణాలు గాల్లో కలసిపోతున్నా... పురాతన భవనాలు, కట్టడాల విషయంలో అధికారులకు, పాలకులకు చీమ కుట్టినట్లు కూడా అనిపించటంలేదు. శిథిల భవనాల్లో నివసించడం, వ్యాపారాలు చేయడం భయంగా మారిందని పలువురు వాపోతున్నారు. ఈ స్థితిలో గద్వాలలో పురాతన కట్టడాలు, నివాస గృహాలు, భవనాల భద్రత, నాణ్యత ఎంతమాత్రం అన్న ప్రశ్న రేకెత్తించింది.

చర్యలు చేపడతాం

పట్టణాల్లో శిథిలావస్థకు చేరిన భవనాలను ఇప్పటికే గుర్తించడం జరిగింది. కోట బురుజుల అంచున నివాసం ఉంటున్న జివిలీ వీధీ వాసులకు గతంలోనే నోటీసులు జారీ చేయడం జరిగింది. శిథిలావస్థ ఇళ్లలో నివాసం ఉంటున్న వారిని గుర్తించి అప్రమత్తం చేశాం. మరోసారి చర్యలు చేపడతాం.



– దశరథ్, మున్సిపల్ కమిషనర్, గద్వాల

గుర్తించినా.. పట్టించుకోవడం లేదు

వానాకాలం ముందు జిల్లాలో పాత భవనాల **ఇళ్లను గుర్తించేందుకు అధికారులు** ఇంటింటి **సర్వే చేపట్టారు. పట్టణాలు,** గ్రామాల్లో **అప్రమత్తం చేసినా ఇంటి యజమానుల్లో అవగాహన కలగటం లేదు. కొంత**మంది ఇం**టికి వెళ్లి నోటీసులు జారీ చేశారు.** కానీ కొం**దరు ఇళ్ల యజమానులు మాత్రం** తమకేమి **పట్టనట్లు ఉండిపోయారు. జిల్లా** కేంద్రంలో **ఇప్పటికే 44 మందికి నోటీసులు** జారీ చేసినట్లు అధికారులు తెలిపారు.

భయం గుప్పిట్లో 60 కుటుంబాలు

జిల్లాకే గర్వకారణంగా నిలిచిన మట్టికోట బురుజులు ప్రమాదకరంగా మారాయి. కోట బురుజుల అంచున ప్రమాదం పొంచి ఉంది. ఏ క్షణాన్నైనా ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. దీంతో శిథిలావస్థలో ఉన్న కోట బురుజులు ఎప్పుడు కూలుతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మట్టి కోట బురుజుల అంచున ఉన్న స్థానిక జివిలి వీధిలో సుమారు 60 కుటుంబాలు జీవనం సాగిస్తున్నారు. వారందరూ నిత్యం ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని జీవించే పరిస్థితి నెలకొంది. అదృష్టవశాత్తు ఇప్పటి వరకు ప్రజలు నివసిస్తున్న ప్రాంతంలోనే మట్టి కోట బురుజులు కూలలేదు. మిగిలిన అన్ని చోట్ల మట్టి కోట బురుజులు కూలిపోయాయి. విధి వక్రీకరిస్తే మాత్రం.. చాలా ఇళ్లు నేలమట్టమయ్యే అవకాశముంది. అనేక మంది ప్రాణాలు గాలిలో కలిసి సమాధి అయ్యే ప్రమాదం ఉంది. అధికారులు జివిలి వీధివాసులకు నోటీసులు ఇచ్చి ఇళ్లు ఖాళీ చేయించడం.. రెండు రోజులు అయిన వెంటనే మళ్లీ వచ్చి ఇళ్లలో చేరడం పరిపాటిగా మారింది.



గద్వాలలో శిథిలావస్థకు చేరుకున్న వాణిజ్య దుకాణ సముదాయం

పొంచి ఉన్న ముప్పు

■ స్థానిక కృష్ణవేణి చౌరస్తా దగ్గర ఉన్న పీఏసీఎస్ గోదాం కూలేందుకు సిద్ధంగా ఉంది. గోదాం షెడ్డుకు ఉన్న దిమ్మెలు శిథిలమై నామమాత్రంగా నిలబడి ఉన్నాయి. ఈ గోదాంలో ఎరువులను ఉంచుతారు. భారీ వర్షం కురిస్తే కుప్పకూలే పరిస్థితి నెలకొంది.

■ గద్వాల మున్సిపాలిటీకి చెందిన చాలా దుకాణాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ముఖ్యంగా డీ, ఈ- బ్లాక్‌లలోని సుమారు 30 దుకాణాలు దెబ్బతిన్నాయి. దుకాణాల పైకప్పులు పెచ్చులూడాయి. ఆ దుకాణాలలో కొంత మంది కారం కొట్టే యంత్రాలు నిర్వహిస్తున్నారు. యంత్రాల శబ్దానికి దుకాణాల గోడలు అదురుతున్నాయని ఇతర వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. మున్సిపాలిటీ జారీ చేసిన నోటీసులు రాజకీయ జోక్యంతో అవి బుట్టదాఖలయ్యాయి.

■ పట్టణంలోని జానకమ్మ సత్రం, బాణాల వెంగన్న దుకాణ సముదాయలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ దుకాణాలు దేవాదాయశాఖ పరిధిలో కొనసాగుతున్నాయి. ఇప్పటికే చాలా సార్లు సిమెంట్ పెచ్చులూడిపడటం, ఇనుప ఊచలు బయటకు వేలాడుతూ భయం కలిగిస్తున్నాయని అందులోని వ్యాపారులు చెబుతున్నారు.

■ ఎంపీడీఓ కార్యాలయం వెనకభాగంలో ఉన్న ప్రభుత్వ క్వార్టర్లు కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. పోలీస్ క్వార్టర్స్‌లోని కొన్ని బ్లాక్‌లు, పీఆర్ సబ్ డివిజన్ కార్యాలయం సైతం దెబ్బతిన్నాయి. కొత్త కలెక్టరేట్ ప్రారంభంతో ఇవన్నీ ఖాళీ అయ్యాయి. అయినప్పటికి శిథిల భవనాలతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వీటితో పాటు పలు శాఖల భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి.

అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తాం



రెవెన్యూ చట్టంపై అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్న న్యాయవాది షఫిఉల్లా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ముసాయిదా నూతన రెవెన్యూ చట్టాన్ని పటిష్టం చేసేందుకు నిపుణులు, మేధావులు ఇచ్చిన సలహాలు, సూచనలను నివేదిక రూపంలో ప్రభుత్వానికి పంపుతామని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో సమావేశం హాలులో తెలంగాణ హక్కుల రికార్డు ముసాయిదా చట్టం-2024పై అవగాహన చర్చ, సలహాలు, సూచనల స్వీకరణ సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి రెవెన్యూ శాఖ అధికారులు, విశ్రాంత అధికారులు, న్యాయవాదులు, రాజకీయ నేతలు, రైతులు, రైతుసంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ముందుగా చట్టం రూపకల్పనపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చేసి వివరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులకు మేలుచేకూర్చే ఉద్దేశ్యంతో మరింత మెరుగైన భూరికార్డుల విధానాన్ని తీసుకొచ్చే క్రమంలో 2020చట్టం స్థానంలో ఆర్ఓఆర్- 2024చట్టాన్ని రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈచట్టం మరింత మెరుగ్గా ఉండేందుకు మేధావులు, రెవెన్యూ నిపుణులు, న్యాయనిపుణుల, విద్యావంతులు, రైతుల నుంచి అభిప్రాయాలు, సలహాలు, సూచనలు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన పలువురు తమ అభిప్రాయాలను, సలహాలు, సూచనలను తెలిపారు. ప్రధానంగా ధరణిలో తలెత్తుతున్న హక్కుల సమస్యలు, మ్యుటేషన్, ప్రొహిబిషన్ వంటి సమస్యలను ఎక్కువగా ప్రస్తావించారు. నూతనంగా రూపొందించే చట్టంలో ఇలాంటి వాటికి పరిష్కారం చూపెడుతూనే రైతులకు కొత్త సమస్యలు తలెత్తకుండా అవసరమైన మార్పులు తీసుకురావాలని పలువురు వక్తలు అభిప్రాయాలు తెలియజేశారు. అదేవిధంగా ముసాయిదా చట్టం రూపొందించడంలో కీలకపాత్ర పోషించిన రెవెన్యూ చట్టాల నిపుణులు ధరణి కమిటీ సభ్యుడు ఎం.సునీల్‌కుమార్ నూతన ఆర్ఓఆర్ చట్టం గురించి కీలక అంశాలను వివరించారు. అదనపు కలెక్టర్లు నర్సింగ్‌రావు, శ్రీనివాస్‌రావు, ఆర్డీఓ రాంచందర్, ఏవో వీరభద్రప్ప, జెడ్పీ సీఈవో కాంతమ్మ, మేధావులు, న్యాయవాదులు, రైతులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జూరాల, నెట్టెంపాడు ఎత్తిపోతల పథకాల పరిశీలన

ధరూరు: జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులను కలెక్టర్ బీఎం సంతోష్ పరిశీలించారు. శనివారం ఆయన మండలంలోని జూరాల ప్రాజెక్టుతో పాటు నెట్టెంపాడు ఎత్తిపోతల పథకాలను పీజేపీ అధికారులతో కలిసి పరిశీలించారు. జూరాల ప్రాజెక్టు వద్ద వరద వివరాలను ఈఈ రహీముద్దీన్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టుకు ఎంత వరద వస్తోంది, ఎన్ని శ్రీశైలం వైపు విడుదల చేస్తున్నారు, నారాయణపూర్, ఆల్మట్టి ప్రాజెక్టుల వివరాలు తెలుసుకున్నారు. అలాగే, జెన్‌కో జల విద్యుత్ కేంద్రం, ఫ్లడ్ కంట్రోల్ రూంలను పరిశీలించారు. అనంతరం నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగమైన గుడ్డెందొడ్డి రిజర్వాయర్ వద్దకు చేరుకొని పూర్తి ఆయకట్టు, నీటిమట్టంపై ఆరా తీశారు. ఇటీవల సాంకేతిక లోపంతో నిలిచిపోయిన పంపునకు సంబందించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

అంగన్‌వాడీలను సమర్థవంతంగా నిర్వహించాలి

గట్టు: అంగన్‌వాడీ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా సంక్షేమ అధికారిణి సుధారాణి అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. శనివారం మండలంలోని పెంచికలపాడు, రాయాపురం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వేస్తున్న రంగులు, నల్లా కనెక్షన్, విద్యుత్ కనెక్షన్లను రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందజేస్తున్న పౌష్టికాహార రికార్డులను పరిశీలించారు. బరువు, ఎత్తు తక్కువగా ఉన్న చిన్నారుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని అన్నారు. కేంద్రం పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, నిర్లక్ష్యం వహించవద్దని అన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



గట్టులో మాట్లాడుతున్న జడ్జి గంటా కవిత

గట్టు: గ్రామీణ ప్రజలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ప్రిన్సిపల్ సినియర్ సివిల్ జడ్జి గంటా కవిత సూచించారు. శనివారం గట్టు రైతు వేదికలో జిల్లా న్యాయ సేవాదికార సంస్థ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూజజ చట్టాలపై అవగాహన లేక పోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అందుకే గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చిన్న చిన్న సమస్యలతో గొడవలు పడి, కేసుల దాకా వెళ్లి విలువైన సమయాన్ని వృథా చేసుకొవద్దని సూచించారు. వృద్ధాప్యంలో వృద్ధులను కుటుంబ సభ్యులు కంటికి రెప్పలా చూసుకోవాలని, నిరాదరణకు గురైన వృద్ధులు సహాయం కోసం ఆర్డీఓను సంప్రదించాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ మల్లేష్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సత్యకళ, సీసీ జ్యోతి, మాజీ వార్డు సభ్యుడు రాము పాల్గొన్నారు.

గోవిందా.. హరి.. గోవిందా

గోవిందా హరి గోవిందా అంటూ హరినామస్మరణతో నిత్యం తిరుమల తిరుపతి దేవస్థానంలో అఖండ భజన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా రాష్ట్రంలోని ఆయా ప్రాంతాల భజన మండలి సభ్యులు అక్కడికి చేరుకొని భగవంతుడిని స్మరించే కీర్తనలతో ఈ భజనల్లో పాలుపంచుకుంటున్నారు. బృందాల వారీగా భజన మండళ్లకు తిరుమల తిరుపతి దేవస్థానం అవకాశం కల్పిస్తోంది. ఇందులో ఉమ్మడి పాలమూరు వాసుల ప్రాతినిధ్యం ఉండడం విశేషం. ప్రతి ఆరు నెలలకోసారి ఆయా భజన మండళ్లకు టీటీడీ నుంచి పిలుపు వస్తుంది. దీంతో వారు అక్కడికి వెళ్లి భజన కీర్తనలతో ప్రదర్శనలు ఇస్తారు. ఏళ్లతరబడిగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి తిరుమలకు వెళ్లి గొంతెత్తి భజనల రూపంలో భగవంతుడిని కీర్తిస్తున్నారు. - గండేడ్



తిరుమలలో భజన చేస్తున్న మహమ్మదాబాద్ భజన మండలి సభ్యులు



- అఖండ హరినామస్మరణలో తరిస్తున్న పాలమూరు వాసులు
- భజనలతో పరవశింపజేస్తున్న సభ్యులు
- ఉమ్మడి జిల్లాలోని 75 మండలాల ప్రాతినిధ్యం
- 300 భజన మండళ్లు క్రమం తప్పకుండా భజనలు
- మహబూబ్‌నగర్ టీటీడీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కార్యక్రమాలు

సండే స్పెషల్

ఉమ్మడి పాలమూరు పరిధిలోని 75 మండలాలకు చెందిన భజన మండళ్లు తిరుమలలో అఖండ హరినామస్మరణలో పాల్గొంటున్నాయి. ఒక్కో మండలంలో రెండు, మూడు భజన మండళ్లు ఇందులో పాలుపంచుకుంటున్నాయి. 2008లో 300 భజన మండళ్ల గ్రూపులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నాయి. ఇందులో 4,500 మంది సభ్యులు క్రమం తప్పకుండా తమ భజనలు, కీర్తనలతో భక్తిపారవశ్యంలో ముంచెత్తుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని ధన్వాడ మండలం కొండాపూర్, హన్వాడ మండలంలోని బుద్దారం, కోయిల్‌కొండ మండలంలోని అంకిళ్ల, మరికల్ మండలంలోని పల్లెగడ్డ తదితర భజన మండళ్లు 15 ఏళ్లకు పైగా తిరుమలలో భజన చేస్తున్నారు. వీటితో పాటు ధన్వాడ, ఊట్కూరు, బిజ్జారం, అవుసులోనిపల్లి, అచ్చంపేట, చందాపూర్, గండేడ్ మండలం కొంరెడ్డిపల్లి, మహమ్మదాబాద్, మూసాపేట, సంకలమద్ది, వేముల, అలంపూర్, బుక్కాపూర్, పైపాడు, రాజోలి, గాజులపేట, నందిపేట గ్రామాలకు చెందిన భజనసభ్యులు స్వామివారి ఆధ్యాత్మిక భజనల్లో పాల్గొంటూ ప్రతిభ చాటుతున్నారు.

ఏడాదికి రెండు, మూడుసార్లు

మహబూబ్‌నగర్ టీటీడీ ఆధ్వర్యంలో భజన మండళ్లు నెలనెల క్రమంలో తిరుమల వెళ్తాయి. టీటీడీ ఉమ్మడి జిల్లా ధర్మ ప్రచార పరిషత్ కోఆర్డినేటర్ డాక్టర్ ఉత్తరాపల్లి రామాచార్యులు ఐదు జిల్లాల్లోని భజన మండళ్లను ఆర్గనైజ్ చేస్తారు. భజన చేయాల్సిన తేదీని సభ్యులకు 15 రోజుల ముందే టీటీడీ నుంచి సమాచారం వస్తుంది. వారు ఒక రోజు ముందు తిరుమలకు చేరుకోవాల్సి ఉంటుంది. అక్కడ భజనమండళ్లకు టీటీడీ అన్నిరకాల వసతులు కల్పిస్తుంది. ఆ మరుసటి రోజు ఉదయం లేదా సాయంత్రం వీరికి సమయం ఇస్తారు. రెండు గంటల పాటు తమకు కేటాయించిన అఖండ హరినామస్మరణ మండపంలో భజన చేయాలి. తిరిగి 12 గంటల తర్వాత మరోసారి మరో 2 గంటల పాటు భజన చేస్తారు. మొదటిసారి భజన అయ్యాక వారికి స్వామి ప్రత్యేక దర్శనం కల్పిస్తారు. దీంతో పాటు రవాణా చార్జీలు కూడా ఇస్తారు. భజన చేసిన వారి ఆధార్, బ్యాంకు ఖాతా నంబర్ తీసుకొని ఎవరి డబ్బులు వారికి టీటీడీనే నేరుగా జమ చేస్తుంది. ఇలా ప్రతి మండలికి ఏడాదిలో రెండు, మూడు సార్లు భజన చేయడానికి అవకాశం కల్పిస్తారు.

బంధువుల వెంట వెళ్లి..



11 ఏళ్ల క్రితం బంధువుల వెంట తిరుమల వెళ్లాను. దర్శనం తర్వాత అక్కడ కొనసాగుతున్న భజనలు చూసి ముగ్ధుడినయ్యా. భజన చేసే వారిని అన్ని వివరాలు అడిగి తెలుసుకున్నా. అప్పుడే తాము కూడా అక్కడ భజన చేయాలని నిర్ణయించుకున్నా. తర్వాత టీటీడీ అధికారి రామాచారి దగ్గరికి వెళ్లి విషయాన్ని చెప్పాను. భజన మండలి రిజిస్ట్రేషన్ అయిన తర్వాత 10 నెలలకు అవకాశం వచ్చింది.

– వెంకటేశ్, వడ్డేపల్లి, గద్వాల జిల్లా

15 సంవత్సరాలుగా..



2008 నుంచి మా గ్రామంలో 15 మందితో కూడిన బృందంతో తిరుమలలో భజన చేయడానికి వెళ్తన్నాం. గ్రామంలో భజన చేసే మేం కలియుగ దైవమైన వేంకటేశ్వరుడి కృప వల్లే ఇది మాకు దక్కింది. మా టీం లీడర్ రామచంద్రయ్య ఆధ్వర్యంలో ప్రతిసారి భజన చేసి వస్తున్నాం. వేంకటేశ్వరుడి సన్నిధిలో భజన చేయడం సంతృప్తిని ఇస్తుంది.

– మంగలి నర్సింహులు, మహమ్మదాబాద్, మహబూబ్‌నగర్

అదృష్టంగా భావిస్తున్నాం..



15 సంవత్సరాలుగా గ్రామంలో భజన కార్యక్రమాలు కొనసాగిస్తున్నాం. అలాంటి మాకు 8 ఏళ్లుగా తిరుమలలో భజన చేయడానికి అవకాశం రావడం చాలా ఆనందంగా ఉంది. ఇక్కడి నుంచే మా తబలాలు, తాళాలు ఇతర సామగ్రి తీసుకెళ్లి భజన చేస్తాం. స్వామివారి దర్శనంతోపాటు వసతి కూడా ఇస్తున్నారు. తిరుమల వేంకటేశ్వరుని సన్నిధిలో భజన చేయడం మా అదృష్టంగా భావిస్తున్నాం.

– దామోదర్‌రెడ్డి, అంకిళ్ల, మహబూబ్‌నగర్ జిల్లా


జీవితానికి పరమార్థం..



దేవదేవుడు వెలసిన చోట భజన చేయడం జీవితానికి పరమార్థంగా భావిస్తున్నాం. ఎన్నో జన్మల పుణ్యఫలంతోనే మాకు ఈ అదృష్టాన్ని కలిగించింది. వచ్చిన అవకాశాన్ని వదలకుండా అక్కడికి వెళ్లి భజనతో సంపూర్ణంగా భగవన్నామ స్మరణ చేసుకుంటున్నాం. భగవంతున్ని కీర్తించే కీర్తనలతో ఇంపైన భజనలు చేస్తున్నాం. మారుమూల ప్రాంతానికి చెందిన మాలాంటి వారికి ఈ అవకాశం రావడం భగవంతుడి కృపే.

– శ్రీరాం, పల్లెగడ్డ, నారాయణపేట జిల్లా

సనాతన ధర్మం..



సనాతన ధర్మం అంతరించిపోకుండా నిలపడానికే ఈ కార్యక్రమాలు చేపడుతున్నాం. రామాయణం, మహాభారతం, భగవద్గీతల గురించి తెలి యజెప్పడం కూడా ఈ కార్యక్రమంలో ఓ భాగం. ఐదు జిల్లాల పరిధిలోని ఆయా మండలాల నుంచి ప్రతినెల ఒక మండలిని అక్కడికి పంపించేలా ప్రణాళిక రూ పొందించాం. ఇంకా చాలా భజన మండళ్లు తమ ప్రదర్శనలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు.

– ఉత్తరాపల్లి రామాచార్యులు, టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ నిర్వాహకుడు

క్లుప్తంగా

చెరువులో మునిగి యువకుడు మృతి


మహేష్ (ఫైల్)

తెలకపల్లి: చేపలవేటకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బొప్పల్లికి చెందిన గుండూరు మహేష్, గుండూరు రేణయ్య తూర్పేవాణి చెరువులోకి శుక్రవారం చేపల వేటకు వెళ్లారు. ప్రమాదవశాత్తు మహేష్(25) చెరువులో మునిగి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు వెతికినా దొరకకపోవడంతో శనివారం చెరువులో మృతదేహం తేలడంతో గుర్తించారు. మృతుడి తండ్రి రెడమయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి భార్య గతంలోనే చనిపోయిందని కుమారుడు ఉన్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి..


శంకర్‌నాయక్ (ఫైల్)

పాన్‌గల్: అనుమానస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, తండావాసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని శాగాపూర్‌తండాకు చెందిన శంకర్‌నాయక్ (42) తన వ్యవసాయ పొలం వద్ద బోరు మోటార్ ఆన్ చేసేందుకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా సమీపంలోని వాగు వద్ద విగతజీవిగా పడి ఉండటాన్ని గమనించారు. ప్రమాదవశాత్తుతో మృతిచెందడా? లేక ఎవరైన హత్య చేశారనే విషయం అర్థం కావడంలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

దుకాణంలో నగదు చోరీ



కొల్లాపూర్: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసుకున్న ఓ దుకాణంలో నగదు చోరీకి గురైంది. నార్లాపూర్ చెందిన సాయిబాబ కొన్నేళ్లుగా బస్టాండ్ ప్రాంగణంలో డబ్బా ఏర్పాటు చేసుకుని జనరల్ స్టోర్ నిర్వహిస్తున్నాడు. గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రేకును తొలగించి లోపలికి చొరబడ్డారు. అందులో ఉన్న రూ.1.30లక్షల నగదును ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం సాయిబాబా వచ్చి దుకాణాన్ని చూడగా చోరీ జరిగినట్లు గుర్తించాడు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు చేరుకొని పరిసర ప్రాంతాలు పరిశీలించారు. చోరీ ఘటనపై విచారణ చేపట్టినట్లు ఎస్‌ఐ హృషికేష్ తెలిపారు.

చోరీ చేసిన వ్యక్తి అరెస్ట్

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలో బైక్‌లను దొంగలిస్తున్న వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ శనివారం తెలిపారు. వనపర్తికి చెందిన మధుకుమార్ ఈనెల 20న జిల్లాకేంద్రంలోని జనరల్ ఆస్పత్రి వద్ద, 22న రాంనగర్ కాలనీలో మరో బైక్‌ను ఎత్తుకెళ్లాడు. బాధితులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. శనివారం ఉదయం వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో మధుకుమార్ పరారయ్యాడు. పోలీసులు అతన్ని అదుపులోకి విచారించగా నేరాన్ని అంగీకరించాడు. కోర్టులో హాజరుపరచగా రిమాండ్ తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నేటి నుంచి బాస్కెట్‌బాల్ టోర్నీ


ఏర్పాట్లను పరిశీలిస్తున్న అసోసియేషన్ సభ్యులు

- ఔట్‌డోర్, ఇండోర్ స్టేడియంలో నిర్వహణ
- హాజరుకానున్న 17 జిల్లాల జట్లు
- 500 మంది క్రీడాకారులు.. 20 మంది అధికారులు రాక

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి అండర్ – 16 బాస్కెట్‌బాల్ పోటీలకు పాలమూరు వేదిక కానుంది. ఆది, సోమవారం ప్రధాన స్టేడియంలో నిర్వహించే పోటీల్లో రాష్ట్రంలోని 17 జిల్లాల జట్లు పాల్గొననున్నాయి. ఆదిలాబాద్, హన్మకొండ, హైదరాబాద్, జగిత్యాల, కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, మహబూబాబాద్, మంచిర్యాల, మెదక్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, నల్గొండ, నిజామాబాద్, రంగారెడ్డి, సూర్యాపేట, వికారాబాద్ జిల్లాల నుంచి 500 మంది క్రీడాకారులు.. 20 మంది అధికారులు హాజరవుతున్నారు. క్రీడాకారులకు మోడ్రన్ స్కూల్, చైతన్య స్కూల్, లిటిల్ స్కాలర్స్ పాఠశాలల్లో వసతి సౌకర్యం కల్పించారు.

జిల్లా బాలుర జట్టు..

పి.ప్రణయ్, కె.అనిల్, ఎస్.రాంచరణ్, ఎం.శశ్వత్, మహ్మద్ అతిఫ్, మహ్మద్ హుస్సేన్, ఎం.యశ్వంత్, రాజారాం, ఎస్.అదిత్, మహ్మద్ సిరాజుద్దీన్, కె.ద్రోణదత్తా, మహ్మద్ అయాజ్.

బాలికల జట్టు..

కె.హర్షిత, సాయినిఖిత, జి.వైష్ణవి, జి.చైత్ర, సి.మేఘన, జి.శ్రీజ, కె.పవిత్ర, ఎస్.రాజేశ్వరి, ఈ.స్నిగ్ధ, టి.సమన్వవి, నషర ఫాతిమా, కె.సహస్ర.

విజయవంతంగా నిర్వహిస్తాం..



జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో 2016 తర్వాత ఇప్పుడే రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీ నిర్వహిస్తున్నాం. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాం. అందరి సహకారంతో టోర్నీని విజయవంతంగా పూర్తి చేస్తాం.

– మక్సూద్‌బిన్ అహ్మద్ జాకీర్, అధ్యక్షుడు, జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్, మహబూబ్‌నగర్

లీగ్ కం నాకౌట్ మ్యాచ్‌లు..

టోర్నీలో లీగ్ కం నాకౌట్ పద్ధతిలో పోటీలు నిర్వహించనున్నారు. సుమారు 90 లీగ్ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఔట్‌డోర్, మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో నిరంతరం ఫ్లడ్‌లైట్ల వెలుతురులో మ్యాచ్‌లు కొనసాగనున్నాయి. ఆదివారం ఉదయం 11 గంటలకు స్టేడియంలో టోర్నీ ప్రారంభం కానుంది. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, రాష్ట్ర క్రీడా వ్యవహారాల సలహాదారు ఏపీ జితేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, శాట్ చైర్మన్ శివసేనారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నారు.


సిద్ధమైన బాస్కెట్‌బాల్ కోర్టు

స్వాహా చేసిన అత్తే తిరిగిచ్చింది

- కల్యాణి పేరిటి భూమి రిజిస్ట్రేషన్ చేసిన వైనం
- న్యాయం దక్కిందన్న బాధితురాలు
- పలువురిని కదిలించిన 'సాక్షి' కథనం

సాక్షి ఎఫెక్ట్..

జడ్చర్ల: నమ్మించి.. తన పేరిట అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న భూమిని అత్తే తిరిగి బాధితురాలికి ఇచ్చింది. మండలంలోని గంగాపూర్‌కు చెందిన ఎడ్ల కల్యాణి పేరిట సర్వే నం.1074/ఈలో 2 ఎకరాల భూమిని ఈ నెల 3న ఆమె మేనమామ భార్య శంకరమ్మ మాయ మాటలు చెప్పి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకుంది. తర్వాత సదరు భూమిని అమ్మకానికి పెట్టి బేరసారాలు సాగిస్తున్న తరుణంలో బంధువుల ద్వారా హైదరాబాద్‌లోని హాస్టల్ ఉంటూ డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న కల్యాణికి అసలు విషయం తెలిసింది. దీంతో తన వారే తనను మోసం చేయడంపై ఒక్కసారిగా కన్నీరు మున్నీరైంది. తనకు జరిగిన అన్యాయంపై గంగాపూర్‌లోని బంధువులు, గ్రామపెద్దల సహకారంతో జడ్చర్ల తహసీల్దార్ సత్యనారాయణరెడ్డిని కలిసి ఫిర్యాదు చేయడంతోపాటు కలెక్టర్, స్థానిక పోలీసుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లి తనకు న్యాయం చేయాలని కోరారు. స్పందించిన వారు మోసపూరితంగా చేసుకున్న అత్త శంకరమ్మతో చర్చించి నచ్చజెప్పడంతో తిరిగి కల్యాణి పేరిట భూమిని రిజిస్ట్రేషన్ చేసేందుకు అంగీకరించింది. ఈ మేరకు శనివారం కల్యాణి పేరిట 2 ఎకరాల భూమి రిజిస్ట్రేషన్ చేయడంతో కథ సుఖాంతమైంది. గంగాపూర్ గ్రామానికి చెందిన మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, బంధువులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను దగ్గరుండి పర్యవేక్షించారు. భూమికి సంబంధించిన పత్రాలను తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి బాధితురాలికి అందజేశారు. ఈ క్రమంలో తన భూమి తనకు దక్కేందుకు మొదటి అడుగు కదిపిన 'సాక్షి'కి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.


తహసీల్దార్‌తో భూ రిజిస్ట్రేషన్ పత్రాలు అందుకుంటున్న కల్యాణి


అక్కున చేర్చుకున్న వారే.. వంచన చేశారు

భూమి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న వైనంపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనం

జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలి

పాలమూరు: మనిషి వ్యాధుల బారి నుంచి తప్పించుకోవాలంటే జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాల్సిన అవసరం ఉందని డాక్టర్ కె.వై రామచంద్రరావు అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో చాలా వరకు ఫాస్ట్ ఫుడ్‌కు అలవాటు పడ్డారని, బర్గర్, కేకులు, చాక్లెట్లు ఇలాంటి ఎన్నో వ్యర్థ పదార్థాలు తినడం వల్ల తొందరగా జబ్బుల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, సిద్ధార్థ యోగా విద్యాలయం, జిల్లా ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో ప్రకృతి ఆరోగ్యంపై నిర్వహించిన ప్రత్యేక అవగాహనలో పాల్గొని మాట్లాడారు. రోజువారీగా తాగే పాలల్లో విషం లాంటి తియ్యని పదార్థాలు కలపడం వల్ల క్యాన్సర్ వంటి జబ్బులకు ప్రజలు దగ్గరవుతున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రకృతిని గౌరవించాలని, సేంద్రియ పంటలను వాడాలన్నారు. తెల్లగా ఉండే అన్నం, ఉప్పు, చక్కెర వాటికి దూరంగా ఉండాలని వాటి బదులుగా రాగి జావా, జొన్న సంకటి, కొర్రలు మొదలైన ఆహారం తీసుకోవాలన్నారు. అనంతరం గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చైర్మన్ డాక్టర్ గున్నా రాజేందర్‌రెడ్డి మాట్లాడారు. డాక్టర్ రామకిషన్, డాక్టర్ రమేష్ సరోదే, బెక్కెం జనార్దన్, ప్రభాకర్‌రెడ్డి, రవికుమార్, ప్రైవేట్ స్కూల్స్ అధ్యక్షుడు ఎస్.ప్రభాకర్ పాల్గొన్నారు.

బొటానికల్ గార్డెన్ సందర్శన

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ఉన్న బొటానికల్ గార్డెన్‌ను శనివారం రాష్ట్ర అటవీ అకాడమీలో శిక్షణ పొందుతున్న 35మంది బీట్ ఆఫీసర్లు సందర్శించారు. గార్డెన్‌కు వచ్చిన బీట్ ఆఫీసర్ల బృందానికి కళాశాల ప్రిన్సిపాల్ డా. సుకన్య, వృక్షశాస్త్రవిభాగం అధిపతి డా.నర్మద స్వాగతం పలికారు. గార్డెన్‌లోని వివిధ విభాగాలను పరిశోధక విద్యార్థి రాహుల్ వారికి చూయించి అవగాహన కల్పించారు. బయోడైవర్సిటీ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ సెంటర్‌లో ఉన్న పాములను అక్కడ భద్రపర్చిన అతిపెద్ద పాము కుబుసాన్ని గురించి వారు తెలుసుకున్నారు. బీట్ ఆఫీసర్ల సమన్వయకర్త రామ్మోహన్ పాల్గొన్నారు.



పరీక్షలో ఫెయిల్.. విద్యార్థిని బలవన్మరణం

నారాయణపేట రూరల్: పరీక్షలో ఫెయిల్ అయ్యాననే మనస్తాపంతో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బీసీవాడీ కాలనీలో నివాసం ఉంటున్న మ్యాడం వెంకటేష్ గంజ్‌లో దడవాయి (కూలీ) పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. 11ఏళ్ల క్రితం భార్య రాధ అనారోగ్యంతో మృతి చెందటంతో ముగ్గురు కుమార్తెలను కష్టపడి చదివిస్తున్నారు. ఈ క్రమంలో పెద్ద కుమార్తె మానస (20) పట్టణంలోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతుంది. గత నెలలో విడుదలైన ప్రథమ సంవత్సరం పరీక్షల్లో మూడు సబ్జెక్టులు ఫెయిల్ అయ్యింది. అప్పటి నుంచి మనస్తాపంతో ఇంట్లో నుంచి బయటకు రాకుండా కుమిలిపోతుంది. శనివారం తండ్రి పనికి వెళ్లిన తర్వాత ఇంట్లో నుంచి బయటకు వెళ్లింది. ఎంతకూ తిరిగి రాకపోవడంతో నానమ్మ లక్ష్మమ్మ వెతుక్కుంటూ దగ్గరలోని రాజీవ్‌గృహకల్ప వద్దకు చేరుకుంది. అక్కడ వారికి చెందిన ఫ్లాట్‌లో తలుపులు మూసి ఉండడం గమనించి ఓ బాలుడిని కిటికి ద్వారా పంపించి గడియ తీయించింది. అప్పటికే మానస మరో గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. వెంటనే చుట్టుపక్కల వారి సాయంతో జిల్లా ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు పరీక్షించి అప్పటికే మృతిచెందిందని తెలిపారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాతపాలెంలో సీహెచ్ స్వాధీనం?

- వివరాలు వెల్లడించేందుకు ఎక్సైజ్ అధికారుల వెనుకంజ
- ప్రజాప్రతినిధుల ఒత్తిడే కారణం
- పరారీలో కల్తీకల్లు విక్రయదారుడు

గద్వాల క్రైం: కల్తీ కల్లు విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు గద్వాల ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ అధికారులు శనివారం కేటీదొడ్డి మండలం పాతపాలెంలోని ఓ కల్లు దుకాణంపై దాడులు చేపట్టారు. ఈ క్రమంలో నిషేధిత సీహెచ్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత డ్రగ్ నిర్మూలన దిశగా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. అందులో భాగంగా టాస్క్‌ఫోర్స్ బృందం విస్తృతంగా కల్లు విక్రయ దుకాణాలపై నిఘా ఉంచి నిత్యం దాడులు చేస్తోంది. ఈ క్రమంలోనే పాతపాలెంలో కల్తీ కల్లు విక్రయాలు చేస్తున్నట్లు సమాచారంతో టాస్క్‌ఫోర్స్ బృందం దుకాణంలో సోదాలు చేపట్టారు. ఇందులో కేజీకి పైగా సీహెచ్ కలిగిన పాకెట్‌ను గుర్తించి సీజ్ చేసినట్లు తెలుస్తుంది. దుకాణంలో ఉన్న కల్లును ధ్వంసం చేసి 24 సీసాలను సీజ్ చేశారని, వాటిని పరీక్షించేందుకు ల్యాబ్‌కు పంపినట్లు సమాచారం. దాడులు జరిగిన విషయం తెలిసిన ప్రధాన విక్రయదారుడు పరారైనట్లు తెలిసింది.

దాడులు వాస్తవమే..

కేటీదొడ్డి మండలం పాతపాలెంలో నిషేధిత కల్లు విక్రయాలు చేస్తున్నట్లు సమాచారం మేరకు శనివారం ఉదయం కల్లు దుకాణంలో తనిఖీ చేపట్టాం. కల్లు కల్తీదా అనే విషయంపై ఆరా తీస్తున్నాం. అక్కడి కల్లు దుకాణం నుంచి 24 సీసాలను సీజ్ చేసి ల్యాబ్‌కు పంపిస్తున్నాం. ల్యాబ్ నివేదిక ఆధారంగా చర్యలు ఉంటాయి. త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తాం.

– సైదిరెడ్డి, ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ

విషయం బయటికి పొక్కకుండా..

ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాతపాలెంలో తనిఖీ చేసిన క్రమంలో సీహెచ్ స్వాధీనం చేసుకున్న విషయం చర్చనీయాంశమైంది. సీహెచ్ దందాలో ఆ గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై ఇప్పటికే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నిషేధిత మత్తు పదార్థాల సరఫరా, కల్తీ మద్యం రవాణా కేసులు ఉన్నాయి. టాస్క్‌ఫోర్స్ సభ్యులు చేసిన దాడుల వ్యవహారంపై గోప్యంగా ఉంచడం తీవ్ర విమర్శలకు దారితీస్తుంది. మరోవైపు ఈ కేసు నుంచి బయట పడేందుకు విక్రయదారుడు ప్రజాప్రతినిధులతో అధికారులపై తీవ్ర ఒత్తిడి తీసుకొస్తున్నట్లు తెలుస్తుంది.

360 కిలోల బెల్లం స్వాధీనం

నారాయణపేట: మండలంలోని ఊటకుంట తండాలో శనివారం స్థానిక ఎక్సైజ్ సీఐ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో దాడులు చేపట్టారు. తండాలోని కిష్ట్యానాయక్ ఇంట్లో 360 కిలోల బెల్లం, 20 కేజీల నవసాగరం, 2 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. దాదాపు 40 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. కేసు నమోదు చేసుకొని అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. దాడుల్లో ఎస్‌ఐ రమేశ్, సిబ్బంది రాంరెడ్డి, సంతోష్, నరేశ్, క్రిష్ణవేణి, ఖాజాపాషా ఉన్నారు.


స్వాధీనం చేసుకున్న బెల్లంతో అధికారులు



పొంచి ఉన్న ప్రమాదం

బ్రిడ్జి పిల్లర్ కిందికి వెళ్తున్న వరద నీరు

అడ్డాకుల మండలంలోని కందూర్ స్టేజీ వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై హైదరాబాద్ వైపు వాహనాలు వెళ్లే పాత బ్రిడ్జి మొదటి పిల్లర్ కింద వరద నీళ్లు వెళ్తున్నాయి. పెద్దవాగులో నిర్మించిన ఫిల్లర్ కింద ఏర్పడిన రంధ్రం నుంచి నీళ్లు వెళ్తుండటంతో బ్రిడ్జికే ప్రమాదం పొంచి ఉంది. దీనికి కొంత దూరంలో నిర్మించిన చెక్‌డ్యాం నుంచి గుడిబండ పెద్ద చెరువుకు వరద నీళ్లు వెళ్లేలా కాల్వ ఉంది. ప్రస్తుతం చెక్‌డ్యాం నిండి వరద నీరు కాల్వ ద్వారా గుడిబండ చెరువు వైపు వెళ్తుండగా మొదటి ఫిల్లర్ వద్ద రంధ్రం ఏర్పడి కాల్వలోని వరద నీరు ఫిల్లర్ కింది నుంచి తిరిగి వాగులోకి వెళ్తున్నాయి. శనివారం సాయంత్రం నీటి పారుదల శాఖ సిబ్బంది, టోల్‌ప్లాజా నిర్వాహకులు వాగు వద్దకు వెళ్లి పరిశీలించారు. యంత్రాల సాయంతో నీళ్లు వెళ్లకుండా చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు. పాత బ్రిడ్జిపై వాహనాలు వెళ్లకుండా కర్నూలు వైపు వాహనాలు వెళ్లే కొత్త బ్రిడ్జి పైకి ట్రాఫిక్‌ను మళ్లిస్తామని టోల్‌ప్లాజా రూట్ ఆఫీసర్ తేజ స్వరూప్ పేర్కొన్నారు.

– అడ్డాకుల


బ్రిడ్జి పిల్లర్ కింది నుంచి వాగులోకి వెళ్తున్న వరద నీళ్లు

ముగ్గురిపై చీటింగ్ కేసు నమోదు

భూత్పూర్: మున్సిపాలిటీలోని అమిస్తాపూర్ శివారులో గల భూవివాదం కేసులో ముగ్గురిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి చెందిన రాఘవేంద్రరాజు, శ్రీనివాస్‌గౌడ్ అమిస్తాపూర్ శివారులోని 205, 196 సర్వేనంబరులో 2.1 ఎకరాల భూమి 2015లో ఇద్దరి పేరున రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ధరణిలో శ్రీనివాస్‌గౌడ్, రాఘవేంద్ర రాజులపై పొలం సమభాగాలుగా పట్టాదారు పాసు పుస్తకాలు వచ్చాయి. శ్రీనివాస్‌గౌడ్ తనకు వచ్చిన సగభాగం భూమిని విక్రయించాడు. తన ప్రమేయం లేకుండా భూమి విక్రయించాడని శ్రీనివాస్‌గౌడ్, రాంప్రసాద్, శివప్రకాష్‌లపై రాఘవేంద్రరాజు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

జూరాలకు తగ్గిన వరద..

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో స్వల్పంగా తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శుక్రవారం రాత్రి వరకు 89వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, శనివారం సాయంత్రానికి 67వేల క్యూసెక్కులకు తగ్గింది. ప్రాజెక్టు 10 క్రస్టు గేట్ల ద్వారా వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. గేట్ల ద్వారా 41,320, విద్యుదుత్పత్తి నిమిత్తం 37,282, ఆవిరి రూపంలో 95, నెట్టెంపాడుకు 1,500, కుడి కాల్వ ద్వారా 496, ఎడమ కాల్వకు 550, కోయిల్‌సాగర్‌కు 315, ఆర్డీఎస్ లింకు కెనాల్‌కు 100, ప్రాజెక్టు నుంచి మొత్తం 81,558 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 9.132 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువన ఉన్న నారాయణపూర్ ప్రాజెక్టుకు 30వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండి, 12 గేట్లను 48,800క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.


జూరాల నుంచి దిగువకు వెళ్తున్న వరద

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: జూరాల ప్రాజెక్టు దిగువ, ఎగువ జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో శనివారం 11 యూనిట్లలో ఉత్పత్తి చేపట్టినట్లు ఎస్‌ఈలు రామసుబ్బారెడ్డి, సురేష్ తెలిపారు. ఎగువలో 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, 104.218 మిలియన్ యూనిట్లు, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు, 79.516 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని చేపడుతున్నారు. ఎగువ, దిగువ జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో ఇప్పటివరకు 183.724 మిలియన్ యూనిట్ల ఉత్పత్తిని సాధించామని తెలిపారు. ప్రస్తుతం 38వేల క్యూసెక్కులను వినియోగించి దిగువ శ్రీశైలంకు నీటిని వదులుతున్నామని చెప్పారు.

రామన్‌పాదులో 1,021 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాదు జలాశయంలో శనివారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 550 క్యూసెక్కుల వరద జలాశయానికి చేరుతుండగా.. సమాంతర కాల్వ ద్వారా నీటి సరఫరా నిలిపివేశారు. ఎన్టీఆర్ కాల్వకు 300 క్యూసెక్కులు, వివిధ ఎత్తిపోతల పథకాలకు 859, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.

శ్రీశైలంలో 884.4 అడుగుల నీటిమట్టం

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో శనివారం 884.4 అడుగుల నీటిమట్టం, 211.9572 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జూరాల నుంచి స్పిల్‌వే ద్వారా 41,320, విద్యుదుత్పత్తి చేస్తూ 37,282, సుంకేసుల నుంచి 17,916, హంద్రీ నుంచి 117 మొత్తం 96,635 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం వస్తున్నాయి. భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 37,882, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 31,402 మొత్తం 69,284 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 30వేలు, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 2,400, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,420 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 17.184 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు. కుడిగట్టు కేంద్రంలో 12.987 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేశారు.

4 గేట్ల ద్వారా సుంకేసుల నీటి విడుదల

రాజోళి: నాలుగు గేట్లను తెరిచి సుంకేసుల డ్యాం నీటిని దిగువకు వదులుతున్నట్లు జేఈ రాజు తెలిపారు. శనివారం ఎగువ నుంచి 20,361 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, 17,916 క్యూసెక్కులను దిగువకు వదిలి, కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులు వదిలినట్లు జేఈ పేర్కొన్నారు.